
సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



మాంసం ముట్టరు!

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం వాల్యానాయక్‌తండాలో కొనసాగుతున్న ఆచారం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

8లో▸



తుర్కయంజాల్: గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు

న్యూస్‌రీల్

థాంక్యూ.. సీపీ సార్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జంటకు ప్రథమ చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నిమజ్జనోత్సవ పనుల్లో ఊపిరి సలపని బిజీలో ఉన్నప్పటికీ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ జంటకు ప్రథమ చికిత్స అందేలా రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ప్రత్యేక చొరవ చూపారు. శనివారం ఉదయం బాలాపూర్ గణేశుడిని దర్శించుకోవడానికి ఓ జంట ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో మల్లాపూర్‌లోని ఆర్సీఐ రోడ్‌లో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. అదే సమయంలో అదే రోడ్డులో వెళ్తున్న సీపీ సుధీర్ బాబు వారిని గమనించారు. వెంటనే వాహనాన్ని నిలిపి సిబ్బంది చేత ప్రథమ చికిత్స చేయించారు. బిజీ సమయంలో కూడా స్వయంగా కమిషనర్ వారికి ప్రథమ చికిత్స చేయించి క్షేమంగా వారు వెళ్లేవరకు చొరవ చూపడంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

జాతీయ స్థాయి శిక్షణకు హెచ్‌ఎం ఎంపిక



సింహాద్రినాయుడు

షాబాద్: జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు ఎంపికైనట్టు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ సీసీఆర్టీ శిక్షణ సంస్థలో శిక్షణ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ గత జూన్‌లో నిర్వహించిన బెస్ట్ ప్రాక్టీస్‌లో ఉత్తమ ప్రదర్శనకుగాను సింహాద్రి నాయుడును జాతీయస్థాయి శిక్షణకు పంపించడం జరిగిందన్నారు. పది రోజుల పాటు నూతన విద్యా విధానంలో క్రాఫ్ట్ స్కిల్స్ అంశంపై శిక్షణ ఉంటుందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: మహిళలు నచ్చిన రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సీ మహిళకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం సుధీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత వ్రతాలు



అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలసిన అనంతపద్మనాభ స్వామి ఆలయంలో అనంత చతుర్దశిని పురస్కరించుకుని శనివారం అనంత వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఒక్కసారి ఈ వ్రతం ఆచరిస్తే 14 ఏళ్ల పాటు చేయాల్సి ఉంటుందని అర్చకులు తెలిపారు. ఆయా జిల్లాలు, కర్ణాటక నుంచి వ్రతం ఆచరించే వారు ఉదయం 9 గంటలకే ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. 185 జంటలు వ్రతం ఆచరించారు. అనంతరం స్వామివారికి కల్యాణం జరిపించారు. ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్ పాల్గొన్నారు.

బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర



జై.. జై గణేశా

ప్రశాంతంగా నిమజనోత్సవం

- చకచకా సాగిన బాలాపూర్ శోభాయాత్ర
- దారి పొడవునా భక్తుల నీరాజనం
- పాతబస్తీ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు చేరిన గణేశుడు
- సరూర్‌నగర్, తుర్కయంజాల్ మాసబ్‌చెరువుల వద్ద కోలాహలం
- పోటాపోటీగా లడ్డూ వేలం పాటలు
- బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణేశ్ నిమజ్జనోత్సవం శనివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజించిన గణనాథులను మేళ తాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువతీ, యువకులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ..జై .. గణపతి బొప్పా మోరియా.. అంటూ హోరెత్తించారు. మండపాల వద్ద వేలం పాటలు హోరాహోరీగా సాగాయి. లడ్డూ ప్రసాదాన్ని చేజిక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్, తుర్కయంజాల్ మాసబ్ చెరువు సహా జిల్లా వ్యాప్తంగా 44 చెరువులు, కుంటలను నిమజ్జనం కోసం ఎంపిక చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం ఐదు గంటలకే ..

ఉదయం ఐదు గంటలకే బాలాపూర్ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత వాహనంపై విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు బొడ్రాయి వద్దకు చేరుకుంది. 10.44 గంటలకు వంగేటి లక్ష్మారెడ్డి లడ్డూ వేలం పాట ప్రారంభించారు. ఆరు నిమిషాల పాటు జోరుగా సాగిన వేలం పాటలో కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. ఆయన ఆరేళ్లుగా వేలం పాటలో పాల్గొంటుండగా ఈ ఏడాది వరించింది. గత ఏడాది వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలను ఉత్సవ కమిటీకి అందజేశారు. అనంతరం లడ్డూను దక్కించుకున్న దశరథగౌడ్‌ను గుర్రపు బండిలో ఎక్కించుకుని మేళతాళాలతో ఊరేగించి హనుమాన్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలాపూర్ టు హుస్సేన్‌సాగర్

ప్రత్యేక పూజలు, వేలం పాట పూర్తయిన తర్వాత ఉదయం 11.30 గంటలకు శోభాయాత్ర మొదలైంది. అశేషభక్త జనం వెంట రాగా గణనాథుడి వాహనం ముందుకు కదిలింది. మల్లాపూర్, చంపాపేట్, పాతబస్తీ సహా ఇతర ప్రాంతాల్లో నెలకొల్పిన విగ్రహాలు అనుసరించాయి. శోభాయాత్ర మధ్యాహ్నం 2 గంటలకు చాంద్రాయణగుట్టకు చేరుకుంది. అటు నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు చార్మినార్.. 3.56 గంటలకు ఎంజే మార్కెట్‌కు చేరింది. సాయంత్రం 4.30కు బషీర్‌బాగ్ దాటింది. 5.30 గంటలకు ట్యాంక్ బండ్ చేరుకుంది. సరిగ్గా 5.50 గంటలకు నిమజ్జన ప్రక్రియ పూర్తయింది. బాలాపూర్ గణేశుడికి దారి పొడవునా భక్తులు నీరాజనం పలికారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చార్మినార్ సహా పలు కూడళ్లలో స్వాగతం పలికారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



సరూర్‌నగర్ చెరువు కట్టపై భక్తుల సందడి

లడ్డూ అధరహో

- బాలాపూర్ వినాయకుడి లడ్డూను కర్మన్‌ఘట్‌కు చెందిన లింగాల దశరథగౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ.4.99 లక్షలు అదనంగా పలకడం విశేషం.
- చేవెళ్ల రచ్చబండ వినాయక లడ్డూను రూ.16,11,001కు అత్తెల్లి బ్రదర్స్ దక్కించుకున్నారు.
- చేవెళ్ల మండలం ఖానాపూర్‌లో చేకూరి అంజిరెడ్డి రూ.9.50 లక్షలకు గణపతి లడ్డూను సొంతం చేసుకున్నారు.
- రాగన్నగూడలో ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను రూ.7.65 లక్షలకు రొక్కం భీంరెడ్డి దంపతులు దక్కించుకున్నారు.
- తుక్కుగూడ బొడ్రాయి ఉత్సవ కమిటీ గణేశుడి లడ్డూను రూ.7,55,111కు ప్రకాష్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.
- శంకర్‌పల్లి మండలం మాసానిగూడ హనుమాన్ మందిర్ గణేశ్ లడ్డూను రూ.7,20,000కు కురుమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీశైలం కైవసం చేసుకున్నారు.
- బడంగ్‌పేట వీరాంజనేయ భక్తసమాజం గణనాథుడి లడ్డూను రూ.7.10 లక్షలకు గౌర సత్తయ్య కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే లడ్డూ రూ.17 లక్షలు పలకడం విశేషం. గతంతో పోలిస్తే ఈసారి రూ.9.90 లక్షలు తక్కువకు ధర పలికింది.
- మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్కేపల్లిలోని వినాయకుడి లడ్డూను రూ.6.50 లక్షలకు ముదిగొండ ప్రభాకర్‌యాదవ్ దక్కించుకున్నారు.
- ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బురుజు వద్ద వినాయకుడి లడ్డూను రూ.6.50 లక్షలకు మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ కోరె కలమ్మ జంగయ్య దక్కించుకున్నారు.
- చేవెళ్లలోని జర్నలిస్టు కాలనీలో జేసీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ ప్రసాదాన్ని రూ.6,06,666కు కోణార్క్ గ్రూప్ సభ్యులు కాసుల ఆనంద్ గౌడ్, కిష్టమొళ్ల త్రినేత్ర దక్కించుకున్నారు.



వేలం పాటలో రూ.16,11,001 పలికిన చేవెళ్ల రచ్చబండ వినాయక లడ్డూ



సమావేశంలో పాల్గొన్న నాయకులు, రైతులు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

ఆమనగల్లు: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని, లేదంటే భూ నిర్వాసితులతో కలిసి ఉద్యమిస్తామని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు పగడాల యాదయ్య హెచ్చరించారు. కొత్త అలైన్‌మెంట్‌తో సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని మాలెపల్లి సమీపంలో శనివారం ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులైన మాలెపల్లి, చింతలపల్లి, మేడిగడ్డ, సింగంపల్లి, నుచ్చుగుట్టతండా, పోలెపల్లి గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకున్న కొద్దిపాటి భూమి ట్రిపుల్‌ఆర్‌తో పోతోందని ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఏకపక్షంగా ప్రకటించి రైతులను గందరగోళంలో పడేసిందని ఆరోపించారు. సరైన సర్వే నిర్వహించకుండా అలైన్‌మెంట్ పేరుతో సర్వే నంబర్లు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఉన్న అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చాల్సి వచ్చిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జగన్, సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ శివశంకర్, మాజీ సర్పంచ్ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. క్యూ తప్పదయా



మొయినాబాద్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

మొయినాబాద్: రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. సురంగల్–మొయినాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 450 బస్తాలు రావడంతో శనివారం పంపిణీ చేశారు. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటల నుంచే మొయినాబాద్ రైతు వేదిక వద్ద బారులు తీరారు. అధికారులు రాకముందే చెప్పులు లైన్లో పెట్టారు. వ్యవసాయాధికారులు రైతువేదిక వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ఎగబడ్డారు. గందరగోళ పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు క్యూ కట్టించారు. మండల వ్యవసాయాధికారి అనురాధ రైతులకు టోకెన్లు రాసి ఇచ్చారు. టోకెన్లు తీసుకున్న రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్దకు వెళ్లి బారులు తీరారు. అక్కడ పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఈఓ మనోహర్‌రెడ్డి దగ్గరుండి రైతులకు యూరియా అందజేశారు. టోకెన్లు తీసుకుని మిగిలిపోయిన రైతులకు మంగళవారం స్టాక్ వచ్చిన తరువాత ఇస్తామని వివరించారు.

ప్రజలకు చేరువగా న్యాయసేవలు

హైకోర్టు న్యాయమూర్తి అభినంద్ కుమార్ శావిలి



చేవెళ్ల: అడిషనల్ జూనియర్ సివిల్‌కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి అభినంద్ కుమార్

చేవెళ్ల: ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసేందుకే అడిషనల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి అభినంద్ కుమార్ శావిలి అన్నారు. మండలకేంద్రంలో అడిషనల్ జూనియర్ సివిల్‌కోర్టును శనివారం ఆయన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడిషనల్ కోర్టులతో ప్రజలకు సత్వర న్యాయం అందించే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, చేవెళ్ల జూనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య, జూనియర్ జడ్జి వినోద్‌కుమార్ ఉపాధ్యాయ, ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో సీనియర్ సివిల్ కోర్టు

మహేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో సీనియర్ సివిల్ కోర్టును శనివారం హైకోర్టు న్యాయమూర్తి అభినంద్ కుమార్ శావిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణ కుమార్, 15వ జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, మహేశ్వరం సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రీటాలాల్ చంద్, జూనియర్ కోర్టు న్యాయమూర్తి అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.హరికిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచకుంటే యుద్ధమే

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం: వికలాంగుల, చేయూత పింఛన్లు పెంచకుంటే ప్రభుత్వంపై యుద్ధం తప్పదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ముఖ్యనేతల సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలదివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6 వేలకు, వితంతు, ఒంటరి మహిళకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పింఛన్లు పెంచే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి యాదిగిరి మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, జిల్లా అధ్యక్షుడు యాచారం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఐదేళ్లుగా అన్యాయం

మంచాల: ఐదేళ్లుగా పాలక ప్రభుత్వాలు కొత్త పింఛన్లు ఇవ్వక పోవడం దారుణమని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి..



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు



కారులో ఇరుక్కుపోయిన సాయికృష్ణ

- ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు
- ముగ్గురికి గాయాలు

మొయినాబాద్: అతివేగంగా వెళ్తున్న కారు అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జవగా డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలోని అమ్డాపూర్ రోడ్డులో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మాదాపూర్ ప్రాంతానికి చెందిన సాయికృష్ణ అతని స్నేహితులు అభిలాష్, ఆనంద్, గురు, మౌలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. శనివారం వీరంతా టీఎస్ 09 ఎఫ్‌డబ్ల్యూ 2607 నంబరు కారులో శంషాబాద్ మండలంలో ఓపెన్ ప్లాట్లు చూసేందుకు వెళ్లారు. సాయంత్రం 5.20 గంటలకు తిరిగి అమ్డాపూర్ మార్గంలో వెళ్తుండగా నజీబ్‌నగర్– ముర్తూజగూడ మధ్య కుక్క అడ్డుగా వచ్చింది. దీన్ని తప్పించే క్రమంలో డ్రైవింగ్ సీట్లో ఉన్న సాయికృష్ణ హ్యాండ్ బ్రేక్ వేశాడు. దీంతో కారు రోడ్డు ఎడమ వైపునకు దూసుకుపోయి, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ధాటికి విద్యుత్ తీగలు తెగిపోయి, ట్రాన్స్‌ఫార్మర్ కారుపై పడింది. అప్పటికే వైర్లు తెగిపోవడంతో ఎవరికీ షాక్ తగలలేదు. డ్రైవింగ్ సీట్లో ఉన్న సాయికృష్ణ కారులోనే ఇరుక్కుపోయాడు. ఇతనితో పాటు మరో ఇద్దరికి గాయాలు కాగా, మిగిలిన ఇద్దరు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు గడ్డపారతో డోర్లు తొలగించి అందరినీ బయటకు లాగారు. ప్రమాదంతో భయాందోళనకు గురైన సాయికృష్ణ స్పృహ కోల్పోయాడు. వెంటనే అతన్ని 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రాణానికి ప్రమాదం లేదని వైద్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కొందుర్గులో క్షుద్ర పూజల కలకలం

కొందుర్గు: మండల కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. పెండ్యాల శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్రపూజలు చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పరిసర పొలాల రైతులు అక్కడికి వెళ్లిచూడగా పసుపు, కుంకుమలతో అలంకరించి, అగర్‌బత్తీలు వెలిగించి కొబ్బరికాయ కొట్టి పూజచేయడంతోపాటు కోడిని బలిచ్చినట్లు బయటపడింది. ఈ విషయమై ఎస్‌ఐ రవీందర్ నాయక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గంట వ్యవధిలో దంపతుల మృత్యువాత

- గుండె పోటుతో భర్త.. తట్టుకోలేక భార్య...
- నాగారం మున్సిపాలిటీలో విషాదం

కీసర: భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి చెందిన సంఘటన నాగారం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీ రోడ్డు నెంబర్–1లో జంబాపురం నారాయణరెడ్డి(70) ఆయన భార్య ఇందిర(65)లతో కలిసి నివాసం ఉంటున్నారు. శుక్రవారం నారాయణరెడ్డి గుండె పోటుతో బాత్‌రూమ్‌లో కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే నారాయణరెడ్డి మృతి చెందారు. దీన్ని తట్టుకోలేని ఇందిర భర్త మరణించిన గంటలోపే మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కాలనీవాసులు గంట వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మృతి చెందడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన నారాయణరెడ్డి, ఇందిరల కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. అంత్యక్రియల నిర్వహణ నిమిత్తం కుమారుడు రావాల్సి ఉందని.. ఈ మేరకు అమెరికాలో ఉన్న కుమారుడికి ఫోన్‌లో సమాచారం అందించినట్లు తెలిపారు. కుమారుడు వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మా ఊరి కోడళ్లు మాంసం ముట్టరు!

'ఆన'వాయితీగా వస్తున్న ఆచారం

సండే స్పెషల్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం వాల్యానాయక్‌తండాలో అనాదిగా కొనసాగుతున్న ఆచారం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ గ్రామానికి కోడలిగా వచ్చే వారిని సాక్షాత్తూ గిరిజన దేవత సీతమ్మగా భావిస్తారు. కొత్త కోడలిగా తండాలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి ఆమె మాంసం, కల్లు, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటుంది. ఇలా తాతల కాలం నుంచి ఈరోజు వరకు తండాకు వచ్చిన సుమారు 200 మందికిపైగా ఈ సంప్రదాయాన్ని సంతోషంగా పాటిస్తుండటం గమనార్హం.

- కల్లు, మద్యం, మత్తుపదార్థాల జోలికెళ్లరు
- వాల్యానాయక్‌తండాలో అనాదిగా వస్తున్న ఆచారం
- పెళ్లి జరిపించే రోజునే ప్రతిజ్ఞ చేయిస్తున్న పెద్దలు
- ఆ క్షణం నుంచే ఆమెకు సీతమ్మతల్లిగా గౌరవం

దుద్యాల్: గిరిజనులు, లంబాడాలు ఇష్టంగా తినేది మాంసాహారమే. అటవీ ప్రాంతంలో ఉండే వీరికి జంతువులు, పక్షులు, చేపలను వేటాడటం, కోళ్లు, మేకలు, గొర్రెలను పెంచడం వంటివి చిన్నతనం నుంచే అబ్బుతాయి. ఈక్రమంలో మహిళలు, పురుషులు, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వారంలో కనీసం మూడుసార్లయినా మాంసం తింటారు. నీసు(మాసం) లేనిదే ముద్దదిగదని చాలా మంది బహిరంగంగానే చెబుతుంటారు. ఇలాంటి వాతావరణంలో పుట్టి పెరిగిన వారికి ఒక్కసారిగా మాంసానికి దూరంగా ఉండమంటే కష్టమే. కానీ వాల్యానాయక్‌తండాకు కోడలిగా వచ్చేవారు ఎవరైనా మాంసం, మద్యానికి దూరంగా ఉండాల్సిందే. సుమారు రెండు శతాబ్దాలకు పైగా ఈ ఆచారం కొనసాగుతోంది. వివాహం చేసుకునే వరుడు తాళికట్టి, కుంకుమబొట్టు పెడితే చాలు కట్టుబాటును పాటించాల్సిందే. అయితే ఇప్పటి వరకూ మహిళలెవరూ దీన్ని కట్టుబాటుగా భావించకపోవడం విశేషం. ఇది ఎక్కడికెళ్లినా తమకు అత్యంత గౌరవాన్ని తెచ్చిపెడుతుందని తండా కోడళ్లు చెబుతున్నారు. ఇతర గ్రామాలు, బంధువుల శుభకార్యాలకు వెళితే తమకు ప్రత్యేక భోజనం వండి పెడుతారని పేర్కొంటున్నారు.

పెళ్లి రోజే ప్రతిజ్ఞ

వాల్యానాయక్‌తండాలో 700 మంది జనాభా ఉంటుంది. ఇంటికి వచ్చే కోడలే తమ వంశాన్ని వృద్ధి చేస్తుందని, ఇంటిల్లిపాదిని తల్లిలా లాలిస్తూ కుటుంబ అభివృద్ధి, అభ్యున్నతికి పాటుపడుతుందని తండావాసుల విశ్వాసం. ఇంటి తీరు వాకిలి చెబుతుందనే విధంగా ఇంట్లోని కోడలు తాత్విక, సత్వ గుణాలను కలిగి ఉంటే.. భర్త, అత్తామామలను బాగా చూసుకుంటుందని, పిల్లలు సైతం ఆమెను అనుకరిస్తారనేది వీరి నమ్మకం. అందుకే వివాహ నిశ్చయానికి ముందే గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు కొత్త కోడలికి అన్ని విషయాలు చెబుతారు. ఇందుకు ఆమె మనస్ఫూర్తిగా అంగీకరించిన తర్వాతే పెళ్లి పక్కా చేస్తారు. పెళ్లి కూతురును ముస్తాబు చేసిన తర్వాత.. మాసం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటానని ఆమెతో ప్రతిజ్ఞ చేయిస్తారు.



వాల్యా నాయక్ తండా గ్రామ ముఖ చిత్రం

ఆచారం వచ్చిందిలా..

సుమారు నూటాయాభై ఏళ్ల క్రితం వాల్యానాయక్ తండాలో అంటు వ్యాధులు(గత్తర) సోకి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈసమయంలో తమను కాపాడమంటూ గిరిజనులు తమ ఆరాధ్య దైవమైన సీతమ్మను పూజించారు. తాము గత్తర నుంచి బయటపడితే తండాలోని కోడళ్లను మాసం, కల్లు వంటివి మాన్పిస్తామని మొక్కుకున్నారు. ఆనాటి నుంచి తండాలో రోగాలు తగ్గి, పంటలు పండాయని, ఆహారం సమృద్ధిగా దొరికిందని వృద్ధులు చెబుతున్నారు.

కరోనా కాలంలోనూ..

ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోనూ తండా కోడళ్లు మటన్, చికెన్, గుడ్డు వంటివి ముట్టుకోలేదు. వైరస్ బారిన పడిన వారికి పోషకాహారం తీసుకోవాలని ఇందులో భాగంగా గుడ్లు, మాంసం తినాలని వైద్యులు సూచించినా ఎవరూ వాటి జోలికి వెళ్లలేదు. తమను అమ్మవారే కాపాడిందని, కాపాడుతుందని చెప్పడం విశేషం. ప్రాణాలు పోయినా పరవాలేదు కానీ ఆచారాన్ని మంటగలిపే పని చేయలేదన్న వీరికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.



సీతమ్మ పండుగలో మహిళలు(ఫైల్)

అందరికీ ఆదర్శంగా..

తాతలు, తండ్రుల కాలంలో మదుమాంసాలకు దూరంగా ఉన్న అనేక కుటుంబాల్లోని వారు ప్రస్తుతం వీటిని అలవాటు చేసుకున్నారు. పార్టీలు, దావత్‌ల పేరుతో మద్యం, మాంసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. మేమెందుకు తినకూడదు అని.. ఎదురు ప్రశ్నిస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గిరిజన కుటుంబాల్లోని కోడళ్లు వీటిని త్యజించడం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

45 ఏళ్లుగా మాంసానికి దూరం



మా తల్లిదండ్రుల గ్రామం రోటిబండ తండా. నా చిన్నతనంలో మాంసం ఇష్టంగా తినేదాన్ని. నాపెళ్లయి 45 ఏళ్లు దాటింది. ఆరోజు నుంచి ఇప్పటి వరకు మాంసం జోలికి వెళ్లలేదు. మా అత్త కూడా మాంసం తినలేదు.

– అస్లీబాయి

తరతరాలుగా వస్తున్న ఆచారం



తండా కోడళ్లు మాంసం తినకూడదనేది తరతరాలుగా వస్తున్న ఆచారం. మాకన్నా పెద్దవాళ్లు పాటించారు.. మేమూ కొనసాగిస్తున్నాం.. ఇప్పటి పిల్లలు కూడా మాతోవలోనే నడవడం సంతోషం కలిగిస్తోంది.

– ప్రమీళాబాయి

అదృష్టంగా భావిస్తున్నా..



నేను పీజీ చదివా.. స్టూడెంట్‌గా ఉన్న రోజుల్లో మాంసాహారం బాగా తినేదాన్ని. నాకు ఇటీవలే పెళ్లయింది. తండా ఆచారాన్ని చెప్పినప్పుడు వింతగా అనిపించినా.. ఇక్కడికి వచ్చాక ఇది ఎంతో అదృష్టమని తెలుసుకున్నా.

– పద్మ

వండుతాం.. కానీ తినం



నేను కూడా మొదట్లో ఇదేం ఆచారం అని విచారపడ్డా. కానీ మాంసం వదిలేసిన కోడళ్లకు ఇక్కడ లభిస్తున్న గౌరవం చూసి ఆ ఆలోచన మారిపోయింది. ఇంట్లో మగవాళ్లు, వచ్చే బంధువులకు వండుతా కానీ నేను తినను.

– శ్రీలత, అంగన్‌వాడీ టీచర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నర్సింగ్‌రావు మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: విధులు ముగించుకుని ఇంటికి తిరిగివెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. మహేశ్వరం మండలం మంకాల గ్రామానికి చెందిన బరిగెల నర్సింగ్‌రావు (27) రావిర్యాలలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం విధులకు హాజరై అర్ధరాత్రి తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. సర్వీస్‌రోడ్డు రావిర్యాల కమాన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నర్సింగ్‌రావు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు. నర్సింగ్‌రావుకు ఏడాది క్రితమే వివాహం అయ్యింది.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

మొయినాబాద్: డ్రై డే రోజు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు దాడి చేశారు. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. శ్రీనివాస కిరాణ షాపులో ఆరు లీటర్ల మద్యం, రాజు కిరాణ షాపులో ఆరు లీటర్ల బీర్లు, జి.ప్రభాకర్ కిరాణ షాపులో 15 లీటర్ల బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు కోకాపేటకు సీఎం రాక

గోదావరి జలాల తరలింపు పనులకు శ్రీకారం

మణికొండ: హైదరాబాద్ ప్రజలకు గోదావరి తాగునీటి తరలింపు, ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్‌లను నింపటం, మూసీ పునరుద్దరణ పనులను ప్రారంభించేందుకు ఈ నెల 8వ తేదీ (సోమవారం) ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోకాపేటకు వస్తున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ వెల్లడించారు. కోకాపేట నియోపోలీస్ లేఅవుట్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుపైకి వెళ్లేందుకు నిర్మించిన ఫ్లై ఓవర్ ట్రంపెట్‌ను సీఎం ప్రారంభిస్తారని వివరించారు. శంకుస్థాపనలను, ప్రారంభోత్సవాల అనంతరం బహిరంగ సభ ఉంటుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. తాగునీటి తరలింపు పనులను జలమండలి వారు రూ.7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్నారని తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి గోదావరి ఫేజ్–1, ఫేజ్–2ల రూపంలో నీటిని గండిపేట పక్కనే నిర్మిస్తున్న భారీ రిజర్వాయర్ వరకు తరలిస్తారని చెప్పారు. అక్కడి నుంచి గండిపేటలోకి నీటిని వదలటం, అది నిండిన తరువాత హిమాయత్‌సాగర్‌కు మళ్లించటం వంటివి చేపడతారని పేర్కొన్నారు. రెండు జలాశయాల ద్వారా మూసీ నదిలోకి నీరు వదలటం వల్ల అందులో ఎప్పటికీ నీటి ప్రవాహం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి, హెచ్‌ఎండీఏ అధికారులు, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లడ్డూలు.. రూ.లక్షలు!



వితలేశ్వరాలయం గణేశ్ లడ్డూతో..



మాసానిగూడలో లడ్డూ సొంతం చేసుకున్న శ్రీశైలం

- అత్తెల్లి బ్రదర్స్ పాట రూ.16,11,001
- 'రచ్చబండ' వేలంలో గణేశ్ లడ్డూ సొంతం

చేవెళ్ల: పట్టణంలోని రచ్చబండ వినాయకుడి లడ్డూ ప్రసాదం రూ.16,11,001 పలికింది. శనివారం రాత్రి నిర్వహించిన శోభాయాత్రలో భాగంగా నిర్వహించిన వేలం పాటలో అత్తెల్లి బ్రదర్స్ స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. గతేడాదికన్నా ఈసారి రూ.8 వేలు అధికంగా పలికింది.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలో గణనాథుని లడ్డూల ధరలు భారీగా పలికాయి. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ హనుమాన్ మందిర్ గణేశ్ లడ్డూను మణికొండ మల్లారెడ్డి రూ.8 లక్షలకు దక్కించుకున్నారు. మండలంలోని మాసానిగూడ హనుమాన్ మందిర్ గణేశ్ లడ్డూను శంకర్‌పల్లి కురుమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీశైలం రూ.7.20 లక్షలకు సొంతం చేసుకున్నాడు. వితలేశ్వరాలయం వద్ద ప్రతిష్ఠించిన స్వామివారి లడ్డూను రూ.9,11,116 ఏనుగు పవన్ కుమార్‌రెడ్డి, ఏనుగు అనిల్ కుమార్‌రెడ్డి సోదరులు దక్కించుకున్నారు. నిర్వాహకులు వీరిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- యాజమాన్యం నిర్లక్ష్యమేనని బాధితుల ఆందోళన
- కేఫ్ యజమాని హామీతో సద్దుమణిగిన వివాదం



హైదరాబాద్- శంకర్‌పల్లి రహదారిపై బైఠాయించిన మృతుడి బంధువులు

శంకర్‌పల్లి: కేఫ్‌లో విద్యుత్ మరమత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. కేఫ్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని, న్యాయం చేయాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు శంకర్‌పల్లి–హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించారు. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన బద్రి శ్రీనివాస్(42)కి భార్య నాగమణి, కూతుళ్లు గౌతమి, గాయత్రి, కొడుకు సతీష్ ఉన్నారు. ఇక్ఫాయ్ కళాశాల ఎదురుగా ఉన్న కేఫ్– 3లో శ్రీనివాస్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. శనివారం కేఫ్‌లో విద్యుత్ మరమ్మతులు చేసే సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆగ్రహించిన బాధితులు మృతదేహంతో కేఫ్ ఎదుట ఆందోళన చేపట్టారు. చివరికి పోలీసులు, గ్రామస్తుల జోక్యం చేసుకుని యాజమానితో మాట్లాడారు. బాధితుని కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకోని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

కుల్కచర్ల: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు దాగి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలోని రవీంద్రభారతి పాఠశాలలో టీచర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అత్యంత గౌరవప్రదమైన ఉపాధ్యాయ, విద్యారంగ వ్యవస్థను ప్రభుత్వాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, విలువలు, సంప్రదాయాలు, దేశభక్తి, జాతీయ భావాలను నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, పాఠశాల డైరెక్టర్ వెంకట్రాములు, ప్రిన్సిపాల్ అబ్దుల్ పర్వస్, రాంచంద్రయ్య, పాల్గొన్నారు.